# కాకీక కాకికి కాక




పాలపర్తి ఇంద్రాణి

# The National Zoo

లెదర్ బూట్సు, లెదర్ చెప్పులు, బెల్టులు, ఇంకా జంతువుల దంతాలు, కొమ్ములతో చేసిన నానారకాల వస్తువులు ధరించి వచ్చిన మనుషుల గుంపు కంచెకి ఓ వైపు.

తాము, తమ కుటుంబాలు వచ్చి తిలకించడానికి వీలుగా వాటి పరిసరాల నించి, గుంపులనించి విడగొట్టి పట్టి తెచ్చిన నానారకాల జంతువులు మరో వైపు.

విక్టరీ! విక్టరీ!

పిల్లా పాపలతో కేరింతలు కొడుతూ విక్కీ దాదాస్ ఓ వైపు.

ఏడుపు మొహాలతో బోనుల్లో కంచెల్లో డిమిత్రీ జంతువులు మరో వైపు.

హై హై మానవ నాయకా!

జయము. జయము.

పిల్లి

పిల్లెనకాల పిల్లి

పిల్లి

పిల్లి ముందు పిల్లి

పిల్లి

పిల్లి ముందు

పిల్లి ముందు

పిల్లి

ఎన్ని పిల్లులో చెప్పుకో చూద్దాం?

పిల్లి కాదెహె! పెద్ద పులి.

ఇంటి పిల్లికి పెద్దన్న.

పెద్ద రాయిలాంటి కెమెరా వేసుకున్న ఆ జపానాయన ఏనుగు, పక్కన్నేను అని ఫొటో తీసుకుందామని ఎంతసేపు చూసినా అది నడ్డి అటేపు తిప్పి అగ్రవర్ణ అహంకారాన్ని చూపిస్తోంది. చువ్వలు పట్టుకుని చింపాంజీలు ప్రజాసంఘాల వాళ్ళల్లాగా హడావిడి చేస్తున్నాయి.

చింపాంజీలకు పళ్ళు తోమే ఉద్యోగాలు ఉంటాయిక్కడ. అంతకు ముందు చింపాజీల పళ్ళు తోమడం ఎలా అనేదానిమీద పీహెచ్.డీ చేసి ఉండాల.

అట్టాగే హిప్పోపోటమస్‌లకు వీపు తోమే ఉద్యోగాలు. ఎలుగుబంట్లకు నాలిగ్గీసే ఉద్యోగాలు.

వేటాడ్డం మర్చిపోయిన కొదమసింహాలు. రగులుతున్న అగ్నిపర్వతాలు. ఉత్తుత్తి పంజాలు గాల్లోకి విసిరి నానీలని భయపెడుతున్నాయి. నానీలంటే ఈగ(్రా. హహ్హా.

దుప్పులన్నీ రిజర్వేషన్ల కోసం వర్సగా నిలబడి పోరాటం మోడ్లో. అటెన్షన్!

ఈ జంతువులున్నాయి చూశా, వీటికి నీతోనే ఢంకా పలాసు అని ఏమీ వుండదు రా. అది మనోళ్ళు కనిపెట్టి నువ్వు మనిషివా, జంతువ్వా అన్న తిట్టు కనిపెట్టారు. జూలో బంగారు జింకలు ఉండవు. ఆ విషయం తెలుసుకోవాలి నువ్వు. తెలిసిందా? ఇంక నడూ ముందుకి.

జిరాఫీ విజిటర్స్ వంక తూస్కారంగా చూసి నాలుగు ఆకులు పీకి చపక్

# Breakrooమోపాఖ్యానము– డబ్బింగు ఢమాల్

నేనలా బ్రేక్ రూమ్‌లో కూచుని,

లోకంలో అన్ని లోపాలు గల చీరలూ మల్లు పంచెలేనట

అంచేత అన్ని పెళ్ళిళ్ళూ ఎంతో కొంత అసంతృప్త ద్రావణాలేనట.

ఏవిటో?

అని ఏవేవో ఆలోచించుకొనుచుండగా చటుక్కున అన్నగారి చిత్రం! భళారే విచిత్రమన్న పాట గుర్తుకొచ్చినది విచిత్రముగ. ఎంత చక్కని పాట! ముఖ్యంగా చిత్రం... భళారే విచిత్రం – అన్న చోట వచ్చే చిన్న సంగీతబ్బిట్టు!

రాచరికపు జిత్తులతో... రణతంత్రపుటెత్తులతో...

రాచరికపు జిత్తులతో రణతంత్రపుటెత్తులతో

సతమతమౌ మా మదిలో మదనుడు సందడి సేయుటే

చిత్రం! ఆయ్... భళారే విచిత్రం!

ఆహా! అన్నగారి హావభావములు! మగసిరి అన్ననదియే ఏమో? ఎంత చక్కని రూపురేఖలు! కోటేరువంటి ముక్కు కదా అన్నగారిది. తామరపువ్వులవంటి కన్నులు.

ఈ రాచనగరుకు రారాజును రప్పించుటే విచిత్రం. పిలువకనే ప్రియవిభుడే విచ్చేయుటే విచిత్రం. మదనుడు సందడి సేయుటే చిత్రం.

ఎంతటి మహారాజైనా ఎపుడో ఏకాంతంలో
ఎంతో కొంత తన కాంతను స్మరించుటే సృష్టిలోని చిత్రం!

బాగుగనే ఉన్నది కానీ ఈ మాటలు అన్నగారి నోటనే పలికించి ఉంటే ధర్మపత్ని గురించి పతి చెప్పు మాటగా ఎంతో అందముగ అమరి ఉండేది కదా! అని పరిపరి విధముల ఆలోచించుకొనుచూ ఉండగా ఆకలి హెచ్చాయెను.

అన్నము వేళ కన్న ముందే ఇంత ఆకలి ఏల వేయుచున్నదని యోచించగా ఉదయాన సమయాభావము వలన అల్పాహారము తీసికొనుట మరచితినని జ్ఞప్తికి వచ్చెను. సాపాటు ఎటూ లేదు పాటైనా పాడు బ్రదర్! అన్న పాట మెదడులో మెదలెను.

బంగారు పంట మనది మిన్నేరు గంగ మనది
ఎలుగెత్తి చాటుదామురా ఇంట్లో ఈగల్ని తోలుదామురా

ఈ పుణ్యభూమిలో పుట్టడం మన తప్పా
ఈ పుణ్యభూమిలో పుట్టడం మన తప్పా

ఆవేశం ఆపుకోని అమ్మానాన్నదే తప్పా...
ఆవేశం ఆపుకోని అమ్మానాన్నదే తప్పా
గంగలో మునకేసి కాషాయం కట్టెయ్ బ్రదర్

అమ్మానాన్నలతో భోజనాలకి కూచున్న వేళలోనో, నలుగురూ కూచున్న వేళ ఏ రేడియోలోంచో, రోడ్డు మీద మైకులోంచో,

అమ్మానాన్నదే తప్పా
అమ్మానాన్నదే తప్పా
అమ్మానాన్నదే తప్పా
ఆవేశం ఆపుకోని...

# సాహిత్యంలో శబ్దము–నిశ్శబ్దము

**శ**బ్దశక్తి అనంతం.

ఈ ప్రపంచమే శబ్దమయం.

కొన్ని ప్రత్యేక శబ్దాలకు, వాటి ఉచ్చారణకు ఉన్న శక్తి గురించి మన ప్రాచీనులు చెప్పిన విషయాలు మనకి తెలియనివి కావు.

శబ్దాలకు ఉన్న అధిదేవతలను గురించిన నమ్మకం మనకు ఎరుకే.

ఈ శబ్దాలు అక్షరాలై, వాటి సముదాయం పదాలై, పదాల సముదాయం వాక్యాలై, ఇదంతా ఒక ప్రత్యేక మానవ సమూహం వారిలో వారు ఒకరి భావాలు ఒకరితో పంచుకోవడానికి ఒక భాష అయ్యి భాసిల్లుతోంది.

ఈ భాష పరిణితి చెంది, ఉన్నత స్థాయిలో కళగా, సాహిత్యంగా రూపొందుతోంది. పాటలు, నాటకాలు, ప్రసంగాలు, కథలు, కవిత్వం ఇలా వివిధ రూపాల్లో భాష కళకు వాహకం అవుతోంది.

అయితే ఈ భావాలు పంచుకోవడం శబ్దంతోనూ, నిశ్శబ్దంతోనూ చేయవచ్చు. Verbal and Non-verbal communication అన్నమాట. భావాలు

పంచుకోవడమే కాదు, ఎదుటి వాడిని హేళన చెయ్యడానికి, కించపరచడానికి, అధికారం, కోపం, ధిక్కారం మొదలైనవి ప్రదర్శించడానికి ఈ భాష, సంకేతాలు, హావభావాలూ పనికొస్తాయి.

ఈ మాటల్లోని అర్థాలు చెప్పే వ్యక్తి వయసుని, స్థాయిని, ఆడ, మగ వీటిని బట్టి, ఎదుటివాళ్ళు అంచనా వేసుకుని అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తారు.

ఆకలేస్తే అన్నం పెడతానంటుంది అమ్మ. ఆకలేస్తే అన్నం పెడతా అని పాడుతుంది కథానాయిక.

ఒకే మాటకు రకరకాల అర్థాలు, నానార్థాలు.

ఆకలి వేస్తే ఏడుస్తాడు పసివాడు. ఇది non-verbal communication.

నాటకాలు, సినిమాలు, నృత్యం వంటి దృశ్యరూపమైన కళల్లో కోపం, తిరస్కారం, ద్వేషం, ప్రేమ అన్నీ మాటలతో అవసరం లేకుండా అభినయించి చూపవచ్చు. తెలియజేయవచ్చు.

పుష్పక విమానం సినిమాలో సంభాషణలు లేకపోయినా సినిమా చక్కగా అర్థం అవుతుంది దృశ్యం వల్ల.

సాహిత్యమే శబ్ద ప్రపంచం. అనుభూతులు నిశ్శబ్ద ప్రపంచానివి.

మరి ఈ నిశ్శబ్దమైన అనుభూతులని మాటల్లోకి మార్చి చెప్పడం ఎలా?

ఒకసారి నసీరుద్దీన్ సంతకు వెళ్ళాడట. అక్కడ మాటలు నేర్చిన చిలకని అమ్ముతున్నాడట ఒకడు. 'మాటల చిలక! యాభై దీనార్లు! యాభై దీనార్లు!' అంటూ. నసీరుద్దీన్ వెంటనే ఇంటికి వెళ్ళి తన టర్కీని తీసుకొచ్చి ఆ చిలక అమ్ముతున్న వాడి పక్కన కూచుని 'టర్కీ వంద దీనార్లు! వంద దీనార్లు!' అని అరవడం మొదలుపెట్టాడట. "నీ టర్కీ కూడా మాట్లాడుతుందా?" అని అడిగాట్ట కొనుక్కోవడానికి వచ్చినవాడు. "ఒక్క ముక్క కూడా మాట్లాడదు" అన్నాట్ట నసీరుద్దీన్. "మాట్లాడకపోవడం కూడా గొప్పేనా?" అని అడిగాట్ట వాడు ఆశ్చర్యపోతూ. "మాట వెండి, మౌనం బంగారం అని మదరసాలో చెప్పలేదుటయ్యా!" అన్నాట్ట నసీరుద్దీన్ 'వంద దీనార్లు! వంద దీనార్లు' అని ఇంకా పెద్దగా అరుస్తూ.

**End of Preview.**

**Rest of the book can be read @**

[http://kinige.com/book/Kakika+Kakiki+Kaka](http://kinige.com/book/Kakika+Kakiki+Kaka)

* * *